శ్రీరామ నవమి ఉత్సవాలకు సర్వం సిద్ధం

● ప్రత్యేక అలంకరణలో దేవాలయాలు ● ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీరామ నవమి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 26 ఉంచి 28 వరకు అధ్యయనోత్సవాలు, 28 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు నవాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఓ ప్రకటనలతో తెలిపారు. శ్రీరామ నవమి వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, దేవాదాయ ధర్మాదాయ శాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి రంగారావులు విచ్చేయుచున్నట్లు తెలిపారు.

పూజా వివరాలు...

◆ 29వ తేదీన ఉదయం 9గంటలకు యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణం, సంతానార్థులకై గరుడ ప్రసాదం, నివేదన తీర్థ ప్రసాద గోష్ఠి, సాయంత్రం 6 గంటలకు నిత్య హోమం, భేరీ పూజ, దేవతాహ్వానం ఎదుర్కోలు, తీర్థ ప్రసాద గోష్ఠి,

◆ 30వ తేదీన ఉదయం 10.30కు శ్రీ సీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవం కై ంకర్య దాతలు జూపల్లి సత్యనారాయణరావు, శైలజ దంపతులు తదుపరి అన్నప్రసాద వితరణ సాయంత్రం 6కు నిత్యహోమం, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి.

◆ 31వ తేదీన ఉదయం 8గంటలకు నిత్యహోమం, 10గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం, తీర్థ ప్రసాదగోష్ఠి సాయంత్రం 6కు నిత్యహోమం, శేష వాహనం, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

◆ అన్నప్రసాద కైంకర్య దాతలు జూపల్లి సత్యనారాయణ, శైలజ దంపతులు, ఉత్సవ ప్రసాద కైంకర్యదాతలు కుర్మయ్యగారి నర్సింగరావు సులోచన దంపతుల కుమారుడు సుదర్శన్‌రావు శ్రీమతి సరిత, రథం అలంకరణ గొట్టుముక్కల నర్సింగరావు, సక్కుబాయిలు వ్యవహరించనున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొని శ్రీరామ నవమి వేడుకలను చూసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

◆ **బాలాజీనగర్ శ్రీసంజీవని ఆంజనేయ స్వామి దేవాలయంలో...**

బాలాజీనగర్‌లోని శ్రీ సంజీవని ఆంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 30వ తేదీన శ్రీ రామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు గూడెపు కొండలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు శ్రీసీతారాముల పంచామృత అభిషేకం, మంగళస్నానాలు వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 11.45 గంటలకు స్వామివార్ల కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. పూజలు ఆలయ పూజారి గోవర్ధనం నర్సింహాచార్యులు పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు.



కూకట్‌పల్లిలోని రామాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

◆ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
◆ శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రామాలయం వద్ద శ్రీరామ నవమి వేడుకల ఏర్పాట్ల పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు ఎండకు తట్టుకునేందుకు చలువ పందిళ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో వాటర్ ట్యాంక్‌లతో పాటు అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, చిన్న తులసి, ఏసీపీ చంద్రశేఖరరావు, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, సీఐ నరసింగరావు, ఈఓ ఆంజనేయులు, ఆలయ కార్యనిర్వాహక అధికారులు పాల్గొన్నారు.



పోచమ్మ తల్లి ఆలయ పూజలో ఎమ్మెల్యే

పోచమ్మ ఆలయంలో పూజలు...

కూకట్‌పల్లిలోని పోచమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం మండల పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయానికి అమ్మవారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ శివశంకర్ నగర్ కాలనీ కాశయ్య వీధిలో రూ.15లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి కాగానే సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, బస్వరాజ్, సాయినాథ్ గౌడ్, శ్రీను, విజయ్, సురేందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవం



కూకట్‌పల్లి: హైదర్‌నగర్ రవీంద్రభారతి పాఠశాలలో స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుజాత విచ్చేసి విద్యార్థులకు యూకేజీ పట్టాలను ప్రదానం చేశారు. స్నాతక గ్రహీతల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీలత, ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, డివిజన్ ఇన్‌చార్జి హఫీజ్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య జయభేరి



ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ చూపిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి బాలాజీనగర్ శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు దేశవ్యాప్తంగా జరిగిన ఐఎన్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్ పరీక్షలో మరోసారి తమ విజయాన్ని చాటి చెప్పారు. ఆలిండియా లెవెల్‌లో జరిగిన పరీక్షల్లో 346 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. గ్రాండ్‌ప్రైజ్‌కు ఒక విద్యార్థి, 6మంది విద్యార్థులు 2, 4, 5 బహుమతులు సాధించగా, 26 మంది కన్సోలేషన్, 338 మంది మెరిట్ సర్టిఫికెట్లు పొందారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సునీల, డీన్ శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, అకడమిక్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్షలో పాల్గొని నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: రాహుల్ గాంధీని పార్లమెంట్ సభ్యుడిగా అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కేపీహెచ్‌బీ రోడ్ నం.1లోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యాగ్రహదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు, పీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం, సత్యనారాయణ చౌదరి, బి-బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు టోచార్, నాగిరెడ్డి, మోయిజ్, బషీర్, విఠల్ రెడ్డి, గొట్టిముక్కల విశ్వతేజేశ్వరరావు, సూరజ్‌కుమార్ తివారీ, గుడెపు నాగరాజు, మేకల రమేష్, తూము సంతోష్‌కుమార్, పల్లపు వేణు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పుష్పారెడ్డి, జ్యోతి, రజిత, శోభ, వరలక్ష్మి, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారు.. అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కాలనీలోని పురవీధుల్లో కోలాటాలు, భజనలతో ఊరేగింపు నిర్వహించారు.

స్తంభాల తొలగింపుతో ట్రాఫిక్ సమస్యకు చెక్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతనగర్ మోర్ సూపర్‌మార్కెట్ లింక్ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పక్కకు జరిగిన రోడ్డును అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు భాగ్యనగర్ సెక్షన్ విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సిబ్బందితో రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలను పంపించి ట్రాఫిక్ లేకుండా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింక్ రోడ్డుతో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గిందన్నారు. అదే విధంగా కాలనీలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ షాబాజ్, లైన్‌మెన్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐలు నవీన్‌కుమార్, నవీన్‌రెడ్డి, సిబ్బంది, కాలనీవాసులు బాలు, శివప్రసాద్, సుబ్బరాజు, ప్రేమ్‌చంద్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాలను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా హైదరాబాద్

మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి స్పష్టీకరణ

రాయదుర్గం: దేశంలోనే అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా హైదారాబాద్ గుర్తింపు సాధించిందని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి స్పష్టం చేశారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఏడీపీ ఐటీ సంస్థ సహకారంతో సైబరాబాద్ పోలీస్ విభాగం 83 సీసీటీవీ కెమెరాలను నానక్‌రాంగూడలో మంగళవారం ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానక్‌రాంగూడ పరిసరాల్లో కమ్యూనిటీలను అతి దగ్గరగా పరిశీలించడానికి తద్వారా శాంతిభద్రతలను అదుపులో ఉంచడానికి, ఈ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఏడీపీ సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఇలాంటి తరహాలోనే ఇతర సంస్థలు కూడా ముందుకొచ్చి సమాజహిత కార్యక్రమాలను చేపట్టాలని ఆమె సూచించారు. ఏడీపీ ఇండియా జనరల్ మేనేజర్ విజయ్ వేములపల్లి మాట్లాడుతూ.. తాము నివశిస్తున్న, కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రాంతంలో కమ్యూనిటీల పట్ల బాధ్యతతో వ్యవహరించడం ద్వారా ఏడీపీ వారసత్వం విస్తరించిందన్నారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ.. రాయదుర్గం, గచ్చిబౌలి, మాదాపూర్ పరిధిల్లో 2,600 సీసీ కెమెరాలు, నేనుసైతం, ఇతర ప్రైవేటు సీసీ కెమెరాలు 30వేల వరకు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ రఘునందన్ రావు, ఏడీపీ సంస్థ ఉన్నతాధికారులు డాక్టర్ విపుల్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోటల్ ముసుగులో వ్యభిచారం

నిందితుల అరెస్టు

కేపీహెచ్‌బీ: సర్దార్ పటేల్ నగర్‌లో బ్యూటీఫుల్ స్టే పేరుతో నిర్వహిస్తున్న ఓయో హోటల్ పై మంగళవారం ఎస్ఓటీ పోలీసులు, కేపీహెచ్‌బీ పోలీసులు దాడులు నిర్వహించారు. బెంగాల్‌కు చెందిన 8 మంది మహిళలను రక్షించి రెస్క్యూహోంకు తరలించారు. ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ కిషన్కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. హోటల్ నిర్వాహకులైన ఐదుగురిలో ముగ్గురు సుజన్ మోండల్, జ్యోతీ మోండల్, మిలన్ షీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లుగా తెలిపారు.

కుట్టు మెషిన్ల పంపిణీ



బాలానగర్: ఫతేనగర్‌లోని నిర్మాణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 16 మంది మహిళలకు కుట్టు మెషిన్లు సంస్థ ఫౌండర్ కేసాని ఉమా పంపిణీ చేశారు. మహిళలకు జీవనోపాధి అవకాశాలను కల్పించడంలో తాము ఎప్పుడూ ముందుంటామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌతమ్, సుయోధన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లో కెమిస్ట్రీ కోసం ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకమైన ఫ్లో కెమిస్ట్రీ కోసం ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు చేయబడింది. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ కింద హెచ్‌సీయూలో ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేయడం విశేషం. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగంలో ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలో ఈ ప్రయోగశాలను స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ డీన్ ప్రొఫెసర్ అశ్వినికుమార్ నంగియా, ప్రొఫెసర్ పెరలిరాము శ్రీధర్ వారి పీహెచ్‌డీ విద్యార్థులు, పోస్ట్ డాక్స్‌తో కలిసి ఏర్పాటు చేశారు. ఫ్లో కెమిస్ట్రీ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. అందులో వేగవంతమైన ప్రతిచర్య సమయాలు, నిమిషాల నుంచి గంటకు బదులుగా అనేక గంటలు, ఒక రోజు వరకు ఉంటుంది. చౌకైనది, ద్రావకాలు, రసాయన కారకాలను తక్కువగా ఉపయోగించడం. సౌకర్యవంతమైన ఉత్పత్తి, స్కేల్‌అప్, పునరుత్పత్తి కూడా సులభం. కెమిస్ట్రీ స్కూల్‌లో ఫ్లో కెమిస్ట్రీ యూనిట్ ఉన్నందుకు గర్వంగా భావిస్తున్నామని హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు పేర్కొన్నారు. ఈ సదుపాయం ఈ రంగంలోని విద్యార్థులు, పరిశోధకులకు సులభంగా శిక్షణ ఇచ్చే అవకాశం కలుగుతుందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి: పేదల ఆరోగ్యం కోసం భద్రత కల్పిస్తున్న ఏకై క ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని 50 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 18 లక్షల 97 వేల 500 రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకునేందుకు ముందస్తుగానే ఎల్ఓసీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెక్కులను అందజేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్‌కు చెందిన పాఠశాలల విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జీఆర్ రమేష్ మంగళవారం పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. వెన్నెల, వివేకానంద, సమీనా బేగం చదువుకు అయ్యే ఒక సంవత్సరం ఫీజును చెల్లించారు. శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని ఆశీర్వదించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

అమోర్ ఆస్పత్రి వైద్యుల ఘనత



కూకట్‌పల్లి: నగరంలోని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఒకటైన అమోర్ ఆస్పత్రి వైద్యులు సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. సికింద్రాబాద్‌కు చెందిన హుస్సేన్‌కు సైనస్ వ్యాధినుంచి విముక్తి కలిగించేందుకు అత్యున్నతమైన సర్జికల్ నావిగేషన్ సిస్టంను ఉపయోగించి ఈ శస్త్ర చికిత్సను చేశారు. ఆసుప్రతి సీనియర్ వైద్యులు అతడికి అందుబాటు ధరలోనే శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. రెండు రోజులు రోగిని పర్యవేక్షణలో ఉంచి ఎటువంటి సమస్య లేకపోవటంతో మంగళవారం డిశ్చార్జి చేశామని ఆస్పత్రి కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు.

ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ లైబ్రరీ పార్కు ఆవరణలో వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహాబేగం, వాటర్ వర్క్స్ డీజీఎం రవికుమార్, ఎస్‌జీఓ మాధురి, మూర్తి, హరికృష్ణ, మొగులయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలన్నారు. గతంలో భూగర్భ జలాలు తక్కువ లోతులోనే లభ్యమయ్యేవని... భూగర్భ జలాలు రానురాను కనుమరుగై పోతున్నాయని తెలిపారు. వెయ్యి అడుగుల లోతు తవ్వితే కానీ నీటి చుక్క పడటం లేదన్నారు. భూగర్భ జలాలు పెరగాలంటే ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యక్తిగతంగా కాకుండా సామజికపరంగా కూడా భారీ ఎత్తున మొక్కలు నాటి, ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకుంటే సకాలంలో వర్షాలు పడి ఇంకుడు గుంతల్లో వర్షపు నీరు చేరి భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వీరారెడ్డి, సంజయ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్, ఆర్‌ఆర్ చారి, యోగి రాజస్వామి, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవిజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేటలోని శ్రీప్రసన్నాంజనేయ దేవాలయంలోని శ్రీవిజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పుష్పగిరి పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్యుల ఆశీస్సులతో శ్రీఆంజనేయ యువజన సంఘం వారి సౌజన్యంతో వేడుకలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మామిడి పద్మశ్రీ ఆధ్వర్యంలో జరిగిన పూజలో ఓంప్రకాశ్ , సుమిత్ర దంపతులు చండీహోమం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భజనలు, కోలాటాల మధ్య అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. ఈ వేడుకలో ఉదయశ్రీ, బీఆర్ఎస్ నాయకులు మేకల హరినాథ్, చారి, బాల్‌రాజ్, మల్లేష్‌యాదవ్, రాజుగౌడ్, ఉమా, సరోజ, శాలిని, అంజనేయ యువజన సంఘం అధ్యక్షుడు మృత్యుంజయ, బీజేపీ నాయకులు సంతోష్‌గౌడ్, అమర్, లక్ష్మణ్, శేఖర్ పాల్గొన్నారు.





శ్రీ విజయ దుర్గాదేవి అమ్మవారు, చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

విద్యుత్ సమస్య... ఆగిన డాక్యుమెంటేషన్

మూసాపేట: మూసాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో డాక్యుమెంటేషన్ ఆగిపోయాయి. విద్యుత్ టెక్నికల్ సమస్యలతో ఆగిపోవడంతో వెంటనే ఎలక్ట్రికల్‌ను పిలిపించి మరమ్మతులు చేపట్టారు. సుమారు 2గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ప్రమాదం పొంచి ఉంది.. కంచెలు ఏర్పాటు చేయండి



హస్మత్‌పేటలోని కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ (గతంలో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ పేలింది ఇక్కడే)



గౌరినగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ (గతంలో మంటలు అంటుకున్న ట్రాన్స్‌ఫార్మర్ ఇదే)



హెచ్ఏఎల్ కాలనీ పార్కు దగ్గర ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ఎక్కడ చూసిన కంచె లేకుండా ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో జరిగిన వరుస సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి వేసవిలో భద్రత లేని ట్రాన్స్‌ఫార్మర్లకు అకస్మాత్తుగా మంటలంటుకోవడం.. పేలిపోతుంటాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరి నుంచి వెళ్లలంటేనే భయపడుతున్నారు.

◆ డివిజన్‌లోని హెచ్ఏఎల్ కాలనీ, మల్లికార్జుననగర్ కాలనీ, గంగపుత్ర సంఘం, భవానీనగర్, హస్మత్‌పేట. అంజయ్యనగర్, సమతానగర్, అర్‌అర్‌నగర్, మాలబస్తీ, వల్లబ్‌నగర్, భవానీనగర్, ఎల్‌బీనగర్‌లలో ప్రమాదకరంగా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. కానీ వీటికి కంచెలు ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

◆ **గతంలో జరిగిన ప్రమాదాలు....**

గతంలో డివిజన్ పరిధిలోని గౌరినగర్‌లో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో స్థానికులు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని పరుగులు తీశారు. ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల చెత్తను వేస్తున్నారు. ఆ చెత్తను తగులబెట్టినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వ్యాపిస్తున్నాయి. ఇంత జరిగినా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచే మాత్రం వేయలేదు.

◆ ఈ సంఘటన మరువక ముందే హస్మత్‌పేటలో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిందని మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పనులు చేస్తుండగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పెద్ద శబ్దం చేస్తూ పేలిపోయింది. అప్పుడే అక్కడి నుంచి వాహనంపై వెళ్తున్న తండ్రి ఇద్దరు కూతుర్లపై వేడి వేడి అయిల్ పడి తీవ్ర గాయాలయ్యాయి. ఇలా డివిజన్‌లో రోజుకో కరెంట్ సమస్య ఉత్పన్నమవుతూనే ఉంది. ఇప్పటికైన ట్రాన్స్‌ఫార్మర్ల పేలిపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు దాని చుట్టూ కంచెను ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.